www.methukuseema news
Methuku Seema

# మెతుకు సీమ

నిత్యం - ప్రజల పక్షం
తెలుగు డిజిటల్ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి :01 | సంచిక :10 | శనివారం | 30 నవంబర్ 2024

Published from : Hyderabad,Sanagareddy
పేజీలు :04 వేల : 5.00






# ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యత



హైదరాబాద్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అత్యంత నిరుపేదలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, సాగుభూమి లేని వారు, పారిశుద్ధ్య కార్మికులు.. ఇలా ప్రాధాన్యత క్రమాన్ని ఎంచుకోవాలని చెప్పారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సలహాదారు వేం నరేందర్ రెడ్డి తో కలిసి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై సీఎం గారు ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించి పలు సూచనలు చేశారు. తొలి దశలో సొంత స్థలాలున్న వారికే ప్రాధాన్యత ఇస్తున్న కారణంగా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో గ్రామ కార్యదర్శితో పాటు మండల స్థాయి అధికారులను బాధ్యులను చేయాలి. అందుకోసం అవసరమైన సాంకేతికతను వినియోగించుకోవాలి. ముఖ్యంగా ఇందిరమ్మ యాప్‌లో ఎలాంటి లోపాలు, లోటుపాట్లు లేకుండా చూడాలి. ఆదివాసీ ప్రాంతాలు, ఐటీడీఏల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రత్యేక కోటా ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి. లబ్దిదారులు ఎవరైనా ఇందిరమ్మ ఇళ్లకు అదనంగా గదులు నిర్మించుకోవాలని ఆసక్తి చూపితే అందుకు అవకాశం కల్పించాలి.

---

# హైదరాబాద్ - టర్కీ దేశాల మధ్య నిజాం కాలం నుండి మెరుగైన సంబంధాలు ఉండేవి

**- తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**



హైదరాబాద్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇండియాలోని టర్కీ రాయబారి ఫిరాట్ సునెల్ హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ - టర్కీ దేశాల మధ్య నిజాం కాలం నుండి మెరుగైన సంబంధాలు ఉండేవన్నారు. టర్కీ రాయబారి హైదరాబాదులోని సంస్కృతి, సాంప్రదాయాలను చూసి తను సొంత దేశంలో ఉన్న అభిప్రాయం కలిగిందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా, వైద్య రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ టర్కీ దేశపు రాయబారి ఫిరాట్ సునెల్ కు వెల్లడించారు. ముఖ్యంగా సామాన్యులకు మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 34 ప్రభుత్వ మెడికల్ కళాశాల తో పాటు 28 నర్సింగ్ కళాశాలలు, పారామెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 74 ట్రామా కేర్ సెంటర్లు తో పాటు మెరుగైన హెల్త్ ఎడ్యుకేషన్ ను రాష్ట్రంలో అందించేందుకు ప్రణాళికలను రూపొందించామన్నారు. 60 శాతం బల్క్ డ్రగ్ ఉత్పత్తులు తెలంగాణ నుండి వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. మెడికల్ టూరిజం అభివృద్ధిలో భాగంగా టర్కీ - తెలంగాణ ల మధ్య మెరుగైన సంబంధాలను పునరుద్ధరణ జరగాలని కోరుకున్నారు. మెడికల్ ఫ్యాకల్టీ, మెడికల్, మౌలిక సదుపాయాల కల్పనలో తెలంగాణ - టర్కీ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడాలని కోరుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్ వి కర్ణన్, టీజీ ఎమ్ ఎస్ ఐ డి సి ఎండి హేమంత్ సహదేవ్ రావ్ లు పాల్గొన్నారు.





# మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఇజ్రాయెల్ సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది - శ్రీధర్ బాబు

- ఏఐ, సైబర్ సెక్యూరిటీలో ఇజ్రాయెల్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందన్న మంత్రి
- రెండు దేశాల మధ్య పరస్పర సహకారానికి ఇజ్రాయెల్ ఆసక్తి
- సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధిలో తోడ్పాటును అందించాలని విజ్ఞప్తి
- మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఇజ్రాయెల్ రాయబారి



హైదరాబాద్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఇజ్రాయెల్ ముందుకు వచ్చిందని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఈ మేరకు ఆ దేశ రాయబారికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. రెండు దేశాల మధ్య పరస్పర సహకారానికి ఇజ్రాయెల్ ఆసక్తి కనబరచడం సంతోషంగా ఉందన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీలో ఇజ్రాయెల్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని, ఆ రంగాల్లో తెలంగాణకు సహకరించాలని మంత్రి కోరారు.రక్షణ రంగం, వ్యవసాయం, నీటి వినియోగంలో ఆధునిక సాంకేతికత, నూతన ఆవిష్కరణలు, పారిశ్రామిక అభివృద్ధిలో తోడ్పాటును అందించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తికి ఇజ్రాయెల్ రాయబారి రువెన్ అజర్ సానుకూలంగా స్పందించారు.తెలంగాణలో 200 ఎకరాల్లో ఏఐ సిటీని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని శ్రీధర్ బాబు ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీపై అత్యాధునిక శిక్షణలో ఇజ్రాయెల్ మద్దతు కావాలని కోరారు. వ్యర్థ జలాల పునర్వినియోగ సాంకేతికతతో తమకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. ఇజ్రాయెల్ నుంచి పరిశ్రమలు పెట్టేందుకు ఏ సంస్థ ముందుకొచ్చినా నైపుణ్యం కలిగిన మానవ వనరులు సిద్ధంగా ఉంటాయన్నారు. నూతన పరిజ్ఞానం, పరిశ్రమల ఏర్పాటులో సాయపడితే తెలంగాణ నుంచే ఉత్పత్తులను ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసుకోవచ్చన్నారు.

# ఐక్యత లేకపోవడం పరస్పర విమర్శలు దెబ్బతీశాయన్న ఖర్గే



న్యూ ఢిల్లీ,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ లోతుగా విశ్లేషిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో ఢిల్లీలో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో అంచనాలను అందుకోలేని రీతిలో ఉన్న పనితీరే పార్టీకి పెద్ద సవాల్‌గా మారుతోందన్నారు.పార్టీలో ఐక్యత లేకపోవడం, ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం వంటివి ఎన్నికల్లో పార్టీని దెబ్బతీశాయన్నారు. ఈ విషయంలో క్రమశిక్షణ అవసరమని అభిప్రాయపడ్డారు. కలిసికట్టుగా పోరాడకుండా ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటుంటే ప్రత్యర్థులపై మనం ఎలా పోరాడగలమన్నారు.కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ ఫలితాల నుంచి ఇప్పటికైనా పాఠాలు నేర్చుకోవాల్సి ఉందన్నారు. పార్టీలో క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో అందరం ఐక్యంగా ఉండాలని... ఇదే మన ఆయుధం అవుతుందన్నారు. పార్టీ విజయమే తన గెలుపు అని ప్రతి ఒక్కరూ భావించాలన్నారు.పార్టీ బలంపై మన శక్తి ఆధారపడి ఉంటుందని భావించాలని వ్యాఖ్యానించారు. లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నూతనోత్సాహంతో పునరాగమనం చేసిందని, కానీ తర్వాత వచ్చిన మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాత్రం ఆశించిన విధంగా లేవన్నారు.నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ఇండియా కూటమి పార్టీలు రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలను ఏర్పాటు చేశాయని, కానీ పనితీరు మాత్రం ఆశించిన విధంగా లేదన్నారు. ఇది భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారుతోందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందు నుంచే సిద్ధం కావాలన్నారు. ఈవీఎంలు ఎన్నికల ప్రక్రియను అనుమానాస్పదంగా మార్చాయని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వ్యూహాలను మార్చుకోవాల్సి ఉందన్నారు. దేశవ్యాప్తంగా ప్రజల అజెండాను అమలు చేసేందుకు కాంగ్రెస్ అధికారంలోకి రావడం చాలా ముఖ్యమన్నారు. మహారాష్ట్ర ఫలితాలతో నిరాశ చెందకుండా పార్టీని బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయి నుంచి ఏఐసీసీ వరకు మార్పులు తీసుకు రావాలన్నారు.

---

# త్వరలో జమిలి ఎన్నికలు... కేసీఆర్ మళ్లీ సీఎం కాబోతున్నారు

- కాంగ్రెస్ పార్టీకి ఓటేసినందుకు ప్రజలు బాధపడుతున్నారన్న ఎర్రబెల్లి
- బీఆర్ఎస్ శ్రేణులు అధైర్యపడొద్దు... త్వరలో కేసీఆర్ సీఎం అవుతారని వ్యాఖ్య
- రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓట్ల రూపంలో రేవంత్ రెడ్డికి బుద్ధి చెబుతారన్న మాజీ మంత్రి



హైదరాబాద్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : త్వరలో దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికలు రాబోతున్నాయని... కేసీఆర్ మళ్లీ తెలంగాణ ముఖ్యమంత్రి కాబోతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్ రావు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసినందుకు ప్రజలు చాలా బాధపడుతున్నారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అధైర్యపడవద్దని... కేసీఆర్ మరోసారి సీఎం అవుతారన్నారు. బీఆర్ఎస్ నిర్వహిస్తున్న దీక్షా దివస్ సందర్భంగా వరంగల్‌లో ఆయన మాట్లాడుతూ... జమిలి ఎన్నికలు వస్తున్నాయని... అప్పుడు కాంగ్రెస్ పార్టీకి కనీసం డిపాజిట్లు కూడా రావని ఎద్దేవా చేశారు. మన ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఓట్ల రూపంలో రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. రాష్ట్రంలో ఎన్నో హాస్టళ్లు, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ జరిగి విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నారని, కానీ రేవంత్ రెడ్డి మాత్రం పాలనను గాలికొదిలేసి తన పార్టీ నేతలతో ఢిల్లీకి వెళ్లి వస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి తీరును ప్రతి ఒక్కరు గమనిస్తున్నారన్నారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమ చరిత్ర తెలుసా? అని ప్రశ్నించారు. వెయ్యి మంది తెలంగాణ బిడ్డలను బలి తీసుకున్న బలిదేవత సోనియా గాంధీ అని విమర్శించారు. సోనియాను నాడు బలిదేవత అన్నది రేవంత్ రెడ్డేనని... ఇప్పుడు మాత్రం దేవత అంటున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. త్వరలో తుపాకీ రాముడి తుప్పు వదలగొడతామన్నారు.

# దీక్ష దివస్ కు తరలిన ఉమ్మడి జిన్నారం మండలం బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు



గుమ్మడిదల,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో దీక్ష దివస్ కార్యక్రమనికి పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మండల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, జిన్నారం వెంకటేష్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నాయికోటి రాజేష్ , కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, నాయకులు సురేందర్ గౌడ్, శివరాజ్, గణేష్, కృష్ణ, పరమేష్ రెడ్డి, శాంతవర్మ రెడ్డి, బల్ భిర్ సింగ్, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మలేష్ గౌడ్, దర్గా శ్రీను,అశోక్,భీమ్ రావు, బిక్షపతి, సుభాష్ తదితరులు దీక్ష దివస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



హత్నూర,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : హైదరాబాదులో జరిగే హలో మాల చలో హైదరాబాద్ సింహ గర్జన సభ విజయవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌల్తాబాద్ లో వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బిక్కన్న, మాట్లాడుతూ డిసెంబర్ 1న మాలల సింహగర్జనను మాల ఉద్యోగస్తులు యువజన సంఘాల నాయకులు మాలల హక్కులను సాధించేవరకు ఊరుకునేది లేదని అందుకు ప్రతి ఒక్కరూ ఐక్యమై చలో హైదరాబాద్ సింహ గర్జన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హలో మాల ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుండరీకం, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, మాల మహానడు సీనియర్ నాయకులు శాంత కుమార్, కిష్టయ్య, మాల మహానాడు మండల అధ్యక్షులు పలంచ రాజీవ్ గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

# దీక్షా దివాస్ కార్యక్రమనికి వెళ్లిన మండల బిఅర్ఎస్ పార్టీ శ్రేణులు



సదాశివపేట,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా దీక్షా దివాస్ కార్యక్రమానికి సదాశివపేట మండలం నుండి జిల్లా పార్టీ కార్యాలయానికి శుక్రవారం నాడు తరలి వెళ్లిన బిఅర్ఎస్ పార్టీ శ్రేణులు. సుమారు 15 సంవత్సరాల కింద కెసిఆర్ తెలంగాణ రాష్ట్రం గురించి దీక్షా దివస్ దీక్ష పట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న రోజు. కాబట్టి అవి స్మరించుకునేందుకు సంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి ఛాయాచిత్ర ప్రదర్శన మరియు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మండలం నుండి సుమారు 150 మంది కార్యకర్తలు తరలి వెళ్లారు. ఇందులో భాగంగా పెద్ద గొల్ల ఆంజనేయులు మాట్లాడుతూ సూదిరిగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుంది. గత పది సంవత్సరాల నుండి ప్రజలకు ఎన్నో రకాలుగా ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టి, ప్రజల మనసులో స్థానం దక్కించుకున్న కెసిఆర్ గారి ప్రభుత్వమే అని గుర్తు చేశారు. కాంగ్రెస్ గవెర్నమెంట్ పాలిస్తున్న తీరును బట్టి ప్రజల్లో తీవ్ర అసంతృ నెలకొంది అని చెప్పి వారు దుయ్యబట్టారు. ఇట్టి కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# విగ్రహ ఏర్పాటుకు టీజిఐఐసి చైర్మన్ కు వినతి పత్రము




సదాశివపేట,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సదాశివపేట పట్టణ పద్మశాలి సంఘ సభ్యులు శుక్రవారం నాడు టీజీఐఐసీ చైర్మన్ తూర్పు నిర్మల జగ్గారెడ్డిని ఆచార్య శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహమును సదాశివ పేట పట్టణములో శివశక్తి లాడ్జ్ ప్రక్కన, దుర్గమ్మ మందిరమునకు వెళ్లే కందకం రోడ్డు జంక్షన్లో ఏర్పాటు చేయుటకు, స్థలమును కేటాయించుటకు గురించి వినతి పత్రం అందజేయగా, వినతి పత్రానికి సానుకూలంగా స్పందించి, విగ్రహ ఏర్పాటు జరిగేటట్లు చూస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు అధ్యక్షులు మునిపల్లి విశ్వనాథం, కార్యదర్శి నక్క ప్రభాకర్, గున్నాల సంజీవ్, బిట్ల ప్రేమ్ కుమార్ మొదలగు వారు పాల్గొన్నారు.

# కుంకుమార్చనకు తరలివచ్చిన మహిళా భక్తులు



రామచంద్రాపురం,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : లోక కళ్యాణార్థం మూడు రోజులు పాటు నిర్వహించ తలపెట్టిన కార్తిక మహోత్సవ వేడుకలు శుక్రవారం ఉదయం భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజి కాలనీలో గల కమ్యూనిటీ హాల్లో వేద మంత్రోచ్చరణల మధ్య ప్రారంభించారు. ప్రారంభ వేడుకలకు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోక కళ్యాణార్థం దైవ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కాంక్షిస్తూ కార్తీకోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనంద దాయకమని పేర్కొంటూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని ఆశీర్వదించి, సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. కన్నుల పండుగగా శోభాయాత్ర కార్తీక మహోత్సవాలను పురస్కరించుకొని గురువారం సాయంత్రం నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండుగగా సాగింది. ఎల్ఐజి బస్టాండ్ దగ్గర నుండి ప్రారంభమైన శోభాయాత్ర కాలనీలోని కమ్యూనిటీ హాల్ వరకు సాగింది. శుభ యాత్రను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆదర్శ్ రెడ్డి ప్రారంభించారు. కాలనీలోని పురవీధుల గుండా కొనసాగిన ఈ యాత్రలో కాలనీ సొసైటీ అధ్యక్షులు యాదగిరి రెడ్డి, డైరెక్టర్లు, కాలనీవాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పొగ మంచులో ప్రయాణం ప్రమాదకరం

- వరి ధాన్యం కుప్పలు రోడ్లపై ఆరబెట్టకూడదు
- పరిమితవేగంతో ప్రాణాలకు రక్షణ
- సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్




కరస్పాండెంట్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : శీతాకాలంలో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి చేరి, పొగమంచు దట్టంగా కమ్మేస్తుంటుందని, రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితులు ఏర్పడతాయని, ఈ సమయంలోనే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. వాహనాల నుంచి వెలుపడే పొగ కారణంగా మంచు మరింత దట్టంగా కమ్ముకొని ఉదయం 8 గంటలైన రోడ్డు సరిగ్గా కనిపించకపోవడం వలన ఈ సమయాల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారే అవకాశం ఉంటుందన్నారు. వాహనానికి లైట్లు వేసుకున్నా కొంత దూరంలో ఉన్న వాహనాలు కూడా దగ్గరకు వచ్చే వరకు కనిపించవని, వేగంగా ప్రయాణం చేస్తే యాక్సిడెంట్లు జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. వాహనదారులు పరిమిత వేగంతో ప్రయాణిస్తే ప్రమాదాలు జరగకుండా నియంత్రించే అవకాశం ఉంటుందన్నారు. చలికాలంలో డ్రైవింగ్ చేసేప్పుడు వాహనాల హెడ్‌లైట్లు, ఇండికేటర్లు వేసుకోవడం శ్రేయస్కరం అన్నారు. ముఖ్యంగా రైతులు వరి ధాన్యం కుప్పలు రోడ్లపై ఆరబెట్టకూడదని సూచించారు. రోడ్లపై రైతులు ధాన్యం కుప్పలు ఆరబోయడం ప్రమాదాలకు దారి తీస్తుందని, ధాన్యం కుప్పలు రోడ్లపై ఆరబోయడం వల్ల ఒకే దారిలో ఎదురెదురుగా ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. ధాన్యం కుప్పల కారణంగా ప్రమాదాలు జరిగితే సంబందిత రైతులపై కేసులు నమోదు చేస్తామని సూచించారు. రైతులు ఆలోచించి ధాన్యం కుప్పలను రహదారులపై పోయకుండా ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలను లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు.

# ఉచిత పశు వైద్య శిబిరం



హత్నూర,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌలాపూర్ గ్రామంలో శుక్రవారం నాడు ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. డాక్టర్ హేమలత పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు సాధారణ చికిత్సలు చూడి పరీక్షలు లేక దూడలకు నట్టల నివారణ మందులు త్రాగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి రైతులు తమ పశువులను రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా టీకాలు వేసుకోవాలని పాడి పశువులు ప్రస్తుతము అనుకూలమైన పరిస్థితి లేక దూడలకు నట్టన నివారణ మందులు నెలకు ఒకసారి ఆరు మాసాలు తప్పకుండా త్రాగించవలెను గోపాలమిత్ర ద్వారా నాటు పశువులకు మేలురకమైన ఎద సూదుల ద్వారా పాడి సంపద పెంపొందించుకోవాలని ఒక పాడి గేదె గాని, ఆవు గాని రైతుకు పాలు ఇచ్చి ఉండాలే లేదా చూడి కట్టే ఉండాలి ఈ రెండు పద్ధతుల మీద రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సుధాకర్ సిబ్బంది సంగమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగాలకై లెక్కచేయని మహోనీయుడు మాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్




కంది,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : తెలంగాణ రాష్ట్రం కోసం తన ప్రాణా త్యాగానికైన లెక్కచేయని మానేయడు కేసీఆర్ అని సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్ష దివాస్ కార్యక్రమంలో రామచంద్రపురం టౌన్ ప్రెసిడెంట్ గోవింద్ యాదవ్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ కోసం 2009 లో ఆమరణ నిరాహార దీక్ష సందర్భంగా దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణ జాతిపిత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ కోసం తన ప్రాణాన్ని లెక్కచేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేసిన రోజు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం మొత్తం ఈరోజు దీక్ష దివస్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థుల ప్రాణాలు పోతున్న పట్టించుకోనీ ముఖ్యమంత్రి అధికారులు

**- ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్**




సంగారెడ్డి,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల బందును విజయవంతం చేయాలని నిన్న సంగారెడ్డి జిల్లా ఎస్ఎఫ్ఐకార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలు పోతున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గత నెల రోజుల నుండి ఫుడ్ ఫాయిజన్ తో విద్యార్థుల ప్రాణాలు పోతున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారులు పట్టించుకోవడంలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతుందన్నారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా దొడ్డు బియ్యంతో నాసికరమైన కూరగాయలతో భోజనం పెడుతున్నారన్నారు.గురుకుల, సంక్షేమ హాస్టల్లు, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యత లేని కారణంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఫుడ్ ఫయిజాన్ తో అస్వస్థకు గురవుతున్నారు. వరుస ఘటనలపై ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి అలాగే ఫుడ్ ఫాయిజన్ తో మృతి చెందిన విద్యార్థుల మృతి కూడా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఈనెల సెప్టెంబర్ 30న జరిగే జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బంద్ ను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు విద్యార్థులకు పాఠశాలల యజమాన్యాలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజకుమార్,ఎస్ఎఫ్ఐ నాయకులు , ప్రభాస్ ,అనిల్, లక్ష్మణ్ ,నరేష్ ,హరి, తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రత్యేక అధికారుల వసతి గృహాలు తనిఖీలు చేయాలి

**- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**



కరస్పాండెంట్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : జిల్లాలోని కస్తూరిబా పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, సంక్షేమ గురుకుల పాఠశాలాలు, మాడల్ పాఠశాలలలో మండల ప్రత్యేక అధికారులు, ఆయా సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు, ఆర్ సీఓ లు నిరంతరం తనిఖీలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్లో ఆయా శాఖల అధికారులు, గురుకులాల, కేజీబీబీల ప్రత్యేక అధికారుల తో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు ఆయా మండలాల పరిధి సంక్షేమ వసతి గృహాలు సంక్షేమ గురుకుల పాఠశాలలను కేజీబీవీపీలను మోడల్ పాఠశాలలను ప్రతి వారం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో, కళాశాలలో, విద్యార్థులతో కలిసి భోజనం చేయాలన్నారు. అధికారులు తనిఖీ సమయంలో ఆయా సంస్థల్లోని వంట గదులు, స్టోర్ రూమ్లను డైనింగ్ హాల్ లను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తరగతి గదులు విద్యార్థుల గదులను కిటికీలు డోర్లు అవసరమైన మరమ్మతులకు ప్రతిపాదన సిద్ధం చేయాలన్నారు. అవసరమైన అద్దె భవనం యజమానులతో మాట్లాడి వెంటనే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. వసతి గృహాలకు అవసరమైన కాంపౌండ్ వాల్ , సోలార్ ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ కు సంబంధించిన నివేదికలు అందించాలన్నారు. వసతి గృహాలకు విద్యార్థులకు సరిపడా మంచినీటి కనెక్షన్లు ఇప్పించాలని మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా అధికారులు తమ విధులు పట్ల నిర్లక్ష్యంగా వహించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, జడ్పీసీఈఓ జానకి రెడ్డి, జిల్లాలోని వివిధ మండలాల ప్రత్యేక అధికారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాల, గురుకుల పాఠశాలల ప్రత్యేక అధికారులు, ఆర్సీఓలు పాల్గొన్నారు.

---

# మాలల సింహగర్జన పోస్టర్ విడుదల



రాయికోడ్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల పరిధిలోని సింగీతం గ్రామంలో శుక్రవారం నాటి సమావేశం లో హలో మాల చలో హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో డిసెంబర్ 1న జరగబోయే మాలల సింహగర్జనకు అందరూ బయలుదేరి మాలల సింహగర్జనను జయప్రదం చేయగలరని వాల్ పోస్టర్ విడుదల చేయడమైనది ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులుగా మోహన్ మరియు ఉపాధ్యక్షులు గా అనిల్, మల్లేశం, భానుచెందర్, ప్రధాన కార్యదర్శి సునీల్, కార్యదర్శి ప్రభాకర్,రాజు, కోశాధికారి రాహుల్, అడ్వైజర్స్ సిద్దయ్య, బాలయ్య, నర్సింగ్ రావు, అమృత్ రావ్, వీరేశం, శ్యామ్, ఏన్నుకోవడం జరిగింది, మాల మహానాడు మండల నాయకులు మాల మహానాడు పోస్ట్ రు విడుదల చేయడం జరిగింది.

# పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక బోధనను పరిశీలించిన ఎంఈఓ దశరథ్




కొండాపూర్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : శుక్రవారం కొండాపూర్ మండల కేంద్రంలో నీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ప్రత్యేక బోధనను ఎంఈఓ దశరథ్ పరిశీలించారు.విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నాయి కావున సమయాన్ని వృధా చేయకుండా. ప్రతిరోజు సాయంత్రం, ఉదయము ఇష్టపడి చదివి 100% ఉత్తీర్ణత సాధించాలని. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని, తాము అనుకున్న గమ్యస్థానానికి చేరుకోవాలని, గ్రామానికి, మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దశరథ్, పాఠశాల ఇన్చార్జి ప్రధాన ఉపాధ్యాయులు సంగమేశ్వర్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

---

# అబద్దాలమీద పాలన సాగిస్తున్న కాంగ్రెస్

**- కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ సాధన**
**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్**






సంగారెడ్డి కరస్పాండెంట్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : అబద్దాల పునాధులపై కాంగ్రెస్ పార్టీ పాలన సాగిస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కందిలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో దీక్షా దివస్ జిల్లా ఇంచార్జి దేవి ప్రసాద్ రావు సమక్షంలో దీక్షా దివస్ వేడుకలు నిర్వహించారు. అంతకు ముందు సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వద్ద గల అమరవీరుల స్థూపానికి పూలు వేసి నివాళి అర్పించి, తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను మలుపు తిప్పిన రోజు.. తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో తన ప్రాణాలను సైతం లెక్క చేయకుండా ఉద్యమ నాయకుడు కేసీఆర్ ప్రత్యేక తెలంగాణ సాధనే లక్ష్యంగా నవంబర్ 29, 2009న ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించిన రోజు అని కొనియాడారు. కేసీఆర్ చారిత్రాత్మక దీక్షకు నేటికి 15 ఏండ్లు పూర్తి చేసుకున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబ్బదాల మీద పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. జిల్లా ఇంచార్జీ దేవిప్రసాద్ మాట్లాడుతూ రాదు అనుకున్న తెలంగాణను సాధించిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ నామరూపాలు లేకుండా చేస్తాం అని, కేసీఆర్ పేరు లేకుండ చేస్తాం అని కలలు కంటున్నారన్నారు. తెలంగాణ చరిత్ర ఉన్నంత వరకు కేసీఆర్ చరిత్రను ఎవరు చేరపలేరని, రేవంత్ కు పాలనపై సోయిలేదు, అన్ని వర్గాల ప్రజలను గ్యారంటీ లతో మోసం చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

---

# విద్యార్థుల ప్రతిభ వెలికితీసేందుకే వైజ్ఞానిక ప్రదర్శనలు

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**





మెదక్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ఈ ఇన్స్ పైర్ వైజ్ఞానిక ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.మెదక్ లోని వేస్లీ స్కూల్స్ 337 అంశాలలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా వారి నైపుణ్యాలను కనబరిచారు.వాటిని తిలకించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా చదువుకొని శ్రాస్తవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థులు సైన్స్, గణితాన్ని ఇష్టపడి చదివి గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. సమస్యకు పరిషారం చూపడానికి, నూతన ఆవిష్కరణలకు సైన్స్, గణితము దోహదపడుతాయన్నారు. ఇన్స్ ఫైర్ వైజ్ఞానిక విద్యార్థులు ప్రదర్శనలో చూపించిన అంశాలను వాటిని ప్రయోగాత్మకంగా అమలు చేసినప్పుడే ఫలితాలు ఉంటాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ తో పాటు విజ్ఞానాన్ని పెంపొందించాలని చెప్పారు. ఆహారం ఆరోగ్యం పరిశుభ్రత–53 సహజ వ్యవసాయం–42, రవాణా కమ్యూనికేషన్–70, విపత్తుల నిర్వహణ–43, వ్యర్థాల నిర్వహణ–45, గణిత నమూనా–48, ఇన్స్ పైర్ –36 అంశాలలో విద్యార్థినీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అంతకముందు కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలో పిల్లలు ప్రదర్శించిన అంశాలను పరిశీలించి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్ మూర్తి, ఎంఈఓ నీలకంఠం, జిల్లాస్థాయి వివిధ ఉపాధ్యాయ అధ్యక్ష, ప్రధాన కోశాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మద్రి గ్రామంలో టొరెంటో గ్యాస్ ఏజెన్సీ పైప్ లైన్ తవ్వకాలను నిలిపివేసి గ్యాస్ పైపులైన్ నిలుపుదల చేయ్యాలి

**-మాజీ మంత్రి వర్యులు జహీరాబాద్ ఇన్ చార్జి డాక్టర్ ఏ చంద్రశేఖర్**




కోహిర్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మండల పరిధిలోని మద్రి గ్రామ శివారు పొలల నుంచి గ్రామానికి అనుకోని టొరంటో గ్యాస్ ఏజెన్సీ వారు రాత్రికి రాత్రి పైప్ లైన్ కనెక్షన్ ఇస్తున్న విషయాన్ని గ్రహించి గతకొద్దీ రోజులుగా నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం నాడు జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ డా చంద్రశేఖర్ కార్యాలయంలో మద్రి గ్రామస్తులు టొరెంటో గ్యాస్ ఏజెన్సీ అక్రమ తవ్వకాలను నిలిపివేసి గ్యాస్ పైపులైన్ నిలుపుదల చేయ్యాలని విజ్ఞప్తి చేయడంతో స్పందించిన నియోజకవర్గ ఇంచార్జ్ డా చంద్రశేఖర్ గ్రామస్తులతో కలిసి టొరెంటో గ్యాస్ పనులు జరుగుతున్న స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులకు అండగా నిలిచి ఎవరికి ఎలాంటి నష్టం జరగకుండా ఉన్నత అధికారులతో మాట్లాడి గ్రామస్తులకు న్యాయం జరిగే విదంగా చర్యలు తీసుకొంటమని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాల్కల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కోహిర్ అధ్యక్షుడు శంషీర్ అలీ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఆర్షద్ అలీ, వైస్ ఎంపిపి షాకిర్ అలీ, ఎంపిటిసి అబ్దుల్ హన్నన్ జావిద్, మల్లన్న పాటిల్, సంగరెడ్డి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పి నర్సింలు, మొహమ్మద్ ఎక్బాల్, వినోద్ రాథోడ్, పట్టణ కాంగ్రెస్ యువ నాయకులు పబ్బతి రాకేష్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.


# పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

**- వారి గొంతుకగా కొట్లాడేవారిని ఎన్నుకోవాలి**
**- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గంగాధర్**



మెదక్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : గ్రాడ్యుయేట్స్ అందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని విఆర్ఎస్ తీసుకున్న డిఎస్పీ మధనం గంగాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇంకా ఎన్నో సంవత్సరాల సర్వీస్ ఉన్నా విఆర్ఎస్ తీసుకుని ప్రజా క్షేత్రంలోకి వచ్చానన్నారు. అనేక కష్ట నష్టాలు ఎదుర్కొని చదువుకొని ఎస్ఐ ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు. ఎస్ఐ నుండి డిఎస్పీ వరకు పదోన్నతి పొంది 26 సంవత్సరాల పాటు సర్వీస్ చేసినట్లు గుర్తు చేశారు. కేవలం పోలీసు శాఖకే పరిమితం కాకుండా నిర్ణయాత్మక వేదికగా సేవ చేయడానికి తాను నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తన జీవితంలో అనుభవించిన అంశాలు, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తా అన్నారు. గ్రాడ్యుయేట్ల గొంతుకగా పనిచేస్తానన్నారు. ఆశీర్వదించి, అలోచించి అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల తరపున కూడా ఎమ్మెల్సీ ఉండాలని కోరారు. తమ పేర్లు నమోదు చేసుకొని మేలైన అభ్యర్థిని ఎన్నుకోవాలని గంగాధర్ విజ్ఞప్తి చేశారు. నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తా అన్నారు.

# టీజీఐఐసీ చైర్మన్ ఇంటిలో కులగణన చేసిన అధికారులు



కరస్పాండెంట్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన, ఇంటింటి సామాజిక సర్వే టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి కుటుంబంలో చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కుటుంబానికి సంబంధించిన వివరాలను టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అధికారులు అందించారు. సర్వే ఫారాలు పూర్తిగా నింపిన తరువాత నిర్మలజగ్గారెడ్డి ఫారాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని సూచించారు.

# విద్యార్థులకు మోటివేషన్ స్కిల్స్ డెవలప్మెంట్ కార్యక్రమం

**- మాజీ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బచ్చుగూడం మల్లేష్ యాదవ్**






కంది,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : కంది మండలం ఇంద్రకరణ్ గ్రామంలో శుక్రవారం నాడు మాజీ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు బచ్చుగూడం మల్లేష్ యాదవ్ ఆధ్యర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషన్ స్కిల్స్ డెవలప్మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది ఎంతో ఉన్నతమైనదని, ఏది సాధించాలన్న విద్యార్థి దశలోనే సాధ్యమౌతుంతాన్నారు. విద్యార్థి దశ అనేది పునాధీ లాంటిదని అన్నారు. విద్యార్థులలో ఉన్న ఆవశ్యకత, అభ్యునతులను బహిర్గత పరుచుటకు డిలైట్ సాఫ్ట్ వేర్ మల్టీనేషన్ కంపెనీ మానేజ్ మెంట్ బృందం వారిచే విద్యార్థులకు మోటివేషన్ స్కిల్స్ డెవలప్మెంట్ మీద క్లాస్ బోధించడం జరిగిందన్నారు. అంతేకాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించరు. విద్యార్థి సమస్యలను దృష్టిలో పెట్టుకొని అన్ని విధాల ఆదుకుంటామని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. విద్యార్థులకు కావలసిన ల్యాబ్ మెటీరియల్ కంప్యూటర్స్ %డ% ప్రింటర్స్ అందిస్తామన్నారు. ఇక ముందు కూడా సహాయ సహకారాలు అందిస్తామని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ టక్కర్ ఉదయ్ సింగ్, ప్రైమరీ స్కూల్ ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అడ్వాకేట్ అరుణ్, మాజీ వార్డ్ మెంబర్ రాము, సిహెచ్ నరేష్, అరుణ్, ప్రభు గౌడ్, సతీష్ యాదగిరి, బి కృష్ణ, ఏ వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి సైన్స్ ఫేయిర్ ఎంతో ముఖ్యం

**- ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి**
**- మెదక్ వెస్లీ కళాశాల ఘనంగా ప్రారంభమైన ఇన్స్పైర్**
**- పెద్ద సంఖ్యలో వచ్చిన ఎగ్జిబిట్లు**




మెదక్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చెందాలంటే విద్యార్థులకు చిన్నప్పటినుండే ఇన్స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శన ల అవసరం ఎంతగానో ఉందని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి వెల్లడించారు. మెదక్ పట్టణంలోని వెస్లీ కళాశాల ఆవరణలో శుక్రవారం మెదక్ జిల్లా స్థాయి ఇన్స్పైర్, వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమైంది, రెండు రోజులపాటు జరగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభ ను బయటకు తీయడానికి ఈ ఇన్స్పైర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యంగా సైన్స్ మానవ మనవడ అభివృద్ధి చెందడానికి ప్రోత్సహించాలె తప్ప ప్రపంచ వినాశనానికి ఉపయోగించవద్దని ఆయన సూచించారు. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి ఎంతగానో చెందుతున్న నేటి కాలంలో విద్యార్థులు టీవీలు సెల్ఫోన్లకు దూరంగా ఉండడం ఎంతగానో మంచిదన్నారు. వాటి ద్వారా కేవలం మంచిని మాత్రమే గ్రహించాలని, చెడుకు దూరంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ నగరంలో కాలుష్యం ఎంతగానో పెరిగిపోయిందని, ఇటీవల హైదరాబాద్ లో సైతం కాలుష్యం పెరుగుతుందని వాటి నివారణకు శాస్త్రవేత్తలు కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక పురోభివృద్ధి పేదలకు అందాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి రాధా కిషన్ మాట్లాడుతూ సైన్స్ అనేది అపారమైనదని పేర్కొన్నారు. న్యూటన్ అనే శాస్త్రవేత్త విజ్ఞాన శాస్త్రం అనేది మహా సముద్రం అని పేర్కొన్నారని దాన్ని జీవిత కాలంలో చేరుకోలేకపోయానని అన్నాడని డీఈఓ వెల్లడించారు. ప్రతి ఏటా నిర్వహించే ఇన్స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ కరోనా మూలంగా గత మూడు సంవత్సరాలుగా ఆన్లైన్లో నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ ఏటా భౌతికంగా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించడానికి వివిధ సంఘాలతో పాటు చాలామంది ఉపాధ్యాయులు మూడు రోజులుగా విధులు నిర్వహిస్తున్నారని ,ఈ సందర్భంగా వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు, అయితే సైన్స్ ఫెయిర్ నిర్మాణంలో చిన్న చిన్న పొరపాట్లు జరుగుతాయని వాటిని భూతద్దంలో చూడొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో జిజ్ఞాస పెంపొందించడానికి ఇన్స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థుల నైపుణ్యం బయటకు తీసే సత్తా కేవలం ఉపాధ్యాయులకే ఉంటుందని ఆమె అన్నారు. ముఖ్యంగా బాల బాలికలు చిన్న గా ఉన్నప్పుడు తల్లిదండ్రులు ఏదైనా వస్తువు ఇస్తే అందులో ఏముంది ఏమిటి ఎలా అని తెలుసుకోవాలని తహతలాడతారని పేర్కొన్నారు. ఏదైనా వస్తువు ఇచ్చినప్పుడు దాన్ని విరగగొడుతుంటారని అంటే అందులో ఏముందని తెలుసుకోవడమే వారి ఉద్దేశం అన్నారు. అలాంటి వారిలో ఎక్కువమంది శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని ఆమె తెలిపారు. 392 ఎగ్జిబిట్లు మెదక్ వెస్లీ కళాశాలలో నిర్వహిస్తున్న సైన్స్ ఫేర్ కు 392 ఎగ్జిబిట్లు వచ్చాయి. రవాణా మరియు కమ్యూనికేషన్ కు సంబంధించి 70, విపత్తు నిర్వహణకు 43, వనరుల నిర్వహణ 58, సహజ వ్యవసాయం 42, వ్యర్థాల నిర్వహణ 45, ఆహార ఆరోగ్య పరిశుభ్రత 53 గణిత నమూనాల గణనా ఆలోచన 48 చొప్పున వచ్చినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈఓ ఎల్లయ్య, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, మెదక్ మండల విద్యాధికారి నీలకంఠం ,టిఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'దీక్షా దివస్

**- తెలంగాణ తల్లి చిత్రపటానికి అమరవీరుల స్తూపానికి పూలమాలతో ఘనంగా నివాళులు**
**- కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం**




మెదక్,నవంబర్ 30 ( మెతుకు సీమ న్యూస్) : మెదక్ జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే యం.పద్మ దేవేందర్ రెడ్డి,నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ లు బట్టి.జగపతి మల్లికార్జున గౌడ్, నాయకులు తిరుపతి రెడ్డి , మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్. కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ళ. అంజనేయులు, బిఆర్ ఎస్ పార్టీ శ్రేణులతో కలసి 'దీక్షా దివాస్'ను ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ తల్లి, చిత్రపటానికి అమరవీరుల స్థూపానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గారి పాలాభిషేకం చేశారు, దీక్ష దివాస్ వద్ద ఉద్యమం సమయంలో చేసిన పోరాటాల చిత్రపటాల గ్యాలరీని ప్రారంభించి ఫోటోలను వీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు యం. పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని ఉద్యమ నాయకుడు కేసీఆర్ గారు ప్రాణాలకు తెగించి కొట్లాడారని అన్నారు. 2009లో నవంబర్ 29న 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో' అన్న దృఢ సంకల్పంతో ఆమరణ నిరాహారదీక్షకు నాటి తెలంగాణ ఉద్యమ నేత, నేటి మాజీ సీఎం కేసీఆర్ పూనుకున్న సందర్భాన్ని గుర్తు చేశారు . కేసీఆర్ గారి దీక్షతో తెలంగాణ రాష్ట్రం సాధ్యమైంది అన్నారు.నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... నాడు కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి.. తెలంగాణ సాధన కోసం ప్రాణత్యాగానికి తెగించిన సందర్భాన్ని తెలంగాణ గడ్డ ఎన్నటికీ మర్చిపోలేదన్నారు. తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన ఘట్టంగా దీక్షా దివాస్ నిలుస్తుందన్నారు. 2009 నవంబర్ 29వ తేదీన కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి స్వరాష్ట్ర సాధనకు బలమైన పునాదులు వేసిందని తెలిపారు. ఈ దీక్ష యావత్ భారతదేశ రాజకీయ వ్యవస్థను కదిలించిందని, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్వయంగా ప్రకటన చేసేలా చేసిందన్నారు. దశాబ్దాల తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్షను నెరవేర్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ లు బట్టి.జగపతి మల్లికార్జున గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్. కృష్ణారెడ్డి,నాయకులు కంఠ రెడ్డి తిరుపతి రెడ్డి ,మాజీ గ్రంధాలయ చైర్మన్ చంద్ర గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల. ఆంజనేయులు, కో కన్వీనర్లు. కృష్ణ గౌడ్ లింగారెడ్డి, జుబేర్ అహ్మద్ ,మెదక్ మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీనివాస్, భీమరి కిషోర్, జయరాజు, మాజీ కౌన్సిలర్ చంద్రకళ,మెదక్ నర్సాపూర్ నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు, పిఏసిఎస్ చైర్మన్ లు మాజీ జెడ్పీటీసీలు ఎంపీపీలు, సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed,Published and owned by baindla Srinivas,Madava nagar,Sangareddy-502001,Telangana State,
Phone No. 9032793832 Mail id:methukuseemanews@gmail.com